# ఆపదలో అండగా ఉంటా



న్యాల్‌కల్ : మల్గి గ్రామంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

- ఎన్నికల్లో స్థానికుడిని ఆశీర్వదించాలి
- అవకాశవాదులను ఓటుతో తరిమికొట్టాలి
- సీఎం కేసీఆర్‌తోనే జహీరాబాద్ అభివృద్ధి
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలి
- బీఆర్ఎస్ అభ్యర్థి కొనింటి మాణిక్‌రావు

న్యాల్‌కల్, నవంబర్ 17 : నేను స్థానికుడిని అని, ఇతర పార్టీలకు చెందిన అభ్యర్థులు వేరే జిల్లాలకు చెందినవారని, తనను ఎన్నికల్లో గెలిపిస్తే ప్రజలకు ఆపద సమయాల్లో అండగా ఉంటానని జహీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. ప్రచారంలో భాగంగా న్యాల్‌కల్ మండలంలోని చినిగేపల్లి, మరియంపూర్, రత్నాపూర్, మల్గి, డప్పూర్, హద్నూర్ గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు డప్పుచప్పుళ్లు, పటాకులు కాల్చుతూ, పూలు చల్లుతూ మాణిక్‌రావుకు స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి వీధివీధినా పర్యటించారు. ఆలయాలు, చర్చిలను సందర్శించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రగతి, సంక్షేమ పథకాలతోపాటు, ఎన్నికల మ్యానిఫెస్టో వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 24 గంటల కరెంట్ ఇవ్వరని, రైతుబంధు బంద్ చేస్తారన్నారు. జహీరాబాద్ నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రైతులకు ఎకరానికి 16 వేలు ఇవ్వనున్నట్లు, రూ. 400 గ్యాస్ సిలిండర్, మహిళకు రూ.3వేల భృతి, రేషన్‌కార్డు ద్వారా సన్నబియ్యం, ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మన్ మహ్మద్ తన్వీర్, సహకార సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, వైస్ ఎంపీపీ గౌసోద్దీన్, అత్మకమిటీ డైరెక్టర్లు శ్రీకాంత్‌రెడ్డి, రాజు, నేతలు భాస్కర్, నర్సింహారెడ్డి, పాండురంగారావుపాటిల్, బస్వరాజ్‌పాటిల్, సంగ్రాంపాటిల్, భూమరెడ్డి, రాజేందర్‌రెడ్డి, షకిల్‌హైమద్, మునీరోద్దీన్, యశ్వంత్‌కుమార్, యూసూఫ్, గౌసోద్దీన్, సర్పంచ్‌లు రవికుమార్, మారుతీయాదవ్, సుమీత్రాబాయి, ఎంపీటీసీలు చంద్రన్న, శివానంద శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

**రైతు బాంధవుడు సీఎం కేసీఆర్**

ఝరాసంగం, నవంబర్ 17: రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న రైతు బాంధవుడిగా నిలిచిన సీఎం కేసీఆర్‌ను ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, ఎన్నికల ఇన్‌చార్జి గౌడ్ అన్నారు. ఝరాసంగం మండలంలోని బర్దిపూర్, పొట్టిపల్లి, ఝరాసంగం, కుప్పానగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు జగదీశ్వర్, ఎంపీటీసీ రాజు, నాయకులు ఎజాజ్ బాబా, నాగన్న, కృష్ణ, రమేశ్‌పాటిల్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఇచ్చేదీలేదు.. వచ్చేదీ లేదు...**

**★ బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సతీమణి మధులత**

జహీరాబాద్, నవంబర్ 17 : కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలు ఇచ్చేదీలేదు.. అధికారంలోకి వచ్చేదీ లేదని బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సతీమణి మధులత తెలిపారు. జహీరాబాద్ పట్టణంలోని వెంకటరమణ కాలనీలో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో నాయకులు అనుషామ్మ, పద్మజ, పుణ్యమ్మ, గడి పుణ్యమ్మ, వెంకటేశం, రాజు, నారాయణ, అక్బర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.



జహీరాబాద్ : వెంకటరమణ కాలనీలో ప్రచారం చేస్తున్న మధులత




న్యాల్‌కల్ : చినిగేపల్లిలో మాణిక్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న వివిధ పార్టీల నాయకులు



న్యాల్‌కల్ : మరియంపూర్‌లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టో వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మాణిక్‌రావు



న్యాల్‌కల్ : మల్గి గ్రామంలోని హోటల్‌లో సమోసాలు విక్రయిస్తూ ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఝరాసంగం : గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు



జహీరాబాద్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న మధులత

# ఓటర్లందరూ ఓటేయాలి

- డీఎల్పీవో రాఘవరావు, ఎన్నికల అధికారి సృజన్‌కుమార్
- పరిశ్రమల్లో కార్మికులకు అవగాహన కార్యక్రమాలు

కోహీర్, నవంబర్ 17 : నవంబర్ 30వ తేదీన నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎల్పీవో రాఘవరావు, ఎన్నికల అధికారి సృజన్‌కుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని దిగ్వాల్‌లోని పిరామల్ పరిశ్రమ, వెంకటాపూర్ గ్లోబల్ గ్రీన్, కవేలిలోని రాక్‌వూల్ పరిశ్రమలో కార్మికులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 30వ తేదీని వేతనంతో కూడిన సెలవురోజుగా ప్రకటించామన్నారు. ఏ గ్రామంలో ఓటు ఉంటే అక్కడికే వెళ్లి, ఓటు వేయాలని సూచించారు. వందశాతం పోలింగ్ నమోదుకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అమరేశ్వరి, ఖాదీర్, ప్రశాంత్, రవికుమార్ ఉన్నారు.

# బాలల హక్కులను కాపాడాలి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 17 : నేటి బాలలు రేపటి పౌరులు అనేవిధంగా దేశభవిష్యత్ బాలలు, యువతరంపై ఆధారపడి ఉన్నదని, సమాజ నిర్మాణానికి విద్యార్థులే ఆధారం అని తారా ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ తెలిపారు. శుక్రవారం తారా ప్రభుత్వ కళాశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులలో నైతిక, సామాజిక, సాంస్కృతిక విలువలు లోపిస్తున్నాయని, ఆధునికత పేరుతో సమాజంలో వికృత పోకడలు దేశ భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉన్నదన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఉన్నతమైన గుర్తింపు రావడానికి అవకాశం ఉన్నదన్నారు. దేశ అభివృద్ధిలో యువతదే ప్రధాన పాత్ర అన్నారు. విద్యార్థులకు చరిత్ర, సామాజిక, ఆర్థిక అంశాలపై అవగాహన ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాలల హక్కులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగధిపతి డాక్టర్ వెంకటేశం, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పద్మజ పాల్గొన్నారు.

# భోజనశాలకు టెండర్ల ఆహ్వానం

సంగారెడ్డి, నవంబర్ 17 : జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం చిద్రుప్పలో కానిస్టేబుళ్లుగా ఎంపికైనవారికి శిక్షణా కాలంలో భోజనశాలకు టెండర్లు ఆహ్వానిస్తున్నామని డీటీసీ అదనపు ఎస్పీ రాములునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అసక్తి ఉన్నవారు 27వ తేదీలోగా టెండర్లు దాఖలు చేయాలని కోరారు. టెండర్ దక్కించుకున్నవారు సంగారెడ్డి జిల్లాలో ఇటీవల ఎంపికైన పోలీసు కానిస్టేబుళ్లు మొత్తం 232 మందికి 9 నెలలకు శిక్షణ కాలానికి భోజన వసతి కల్పించాలని వివరించారు. ఔత్సాహికులు రూ.500 చెల్లించి ఈ నెల 27 సాయంత్రం 5 గంటల లోపు టెండర్ సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు డీటీసీ అదనపు ఎస్పీ రాములునాయక్ 8712656703,8328451992 ఫోన్ నంబర్లను కార్యాలయ సమయాల్లో సంప్రదించాలని సూచించారు.

# కొత్తూర్‌లో ఆలయ వార్షికోత్సవం

కోహీర్, నవంబర్ 17 : మండలంలోని కొత్తూర్(డీ) గ్రామంలో హనుమాన్ దేవాలయ పంచమ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం వేడుకల్లో భాగంగా ఆలయ ఆవరణలో గౌరీ గణపతి పూజ, మండపారాధన, విశేష అభిషేకం, నాగవల్లి పత్రిపూజ, లక్ష్మీగణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకలను పురస్కరించుకొని శనివారం ఉదయం శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని, ఆదివారం మధ్యాహ్నం బోనాల ఊరేగింపు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ షఫీయోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు నర్సింహులు, మాణిక్ ప్రభు, రంగన్న, వీరన్న, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో, బైక్ ఢీ.. ఒకరు దుర్మరణం



సత్యనారాయణ (ఫైల్)

ఝరాసంగం, నవంబర్ 17 : ఆటో, బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఝరాసంగం మండలంలోని కుప్పానగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్సై రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. కోహీర్ మండలం మద్రి గ్రామానికి చెందిన సజ్జపూరం సత్యనారాయణ(28) జహీరాబాద్‌లోని ఫైవ్‌స్టార్ ఫైనాన్స్‌లో పనిచేస్తున్నారు. శుక్రవారం వృత్తిరీత్యా సత్యనారాయణ జహీరాబాద్ నుంచి ఝరాసంగం బైక్(TS15FC 6644)పై వెళ్తుండగా కుప్పానగర్ శివారులోని గుబ్బడి సంగమేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఝరాసంగం నుంచి వస్తున్న ఆటో (TS15UD 3679) అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తండ్రి నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సీజ్ చేసిన నగదు విడుదల

- తనిఖీల్లో సీజ్ చేసిన నగదుపై ఆధారాల పరిశీలన
- బాధితులకు రూ.3.08 కోట్లు విడుదల
- జిల్లా గ్రీవెన్స్ కమిటీలో నగదు పొందవచ్చు
- సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్



సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 17 : జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సీజ్ చేసిన నగదు విడుదలకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ కమిటీ ద్వారా సరైన ఆధారాలు సమర్పించిన వారికి ఇప్పటివరకు రూ.3 కోట్ల 8లక్షల 55వేల 738 నగదును విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శరత్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు. ఎన్నికల షెడ్యూలు వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు 147 కేసుల్లో రూ.4,61,60,738 నగదు సీజ్ చేశామన్నారు. ఇందులో 133 కేసులకు సంబంధించి రూ.3 కోట్ల 8లక్షల 55వేల 738 నగదు విడుదల చేశామన్నారు. మిగతా 14 కేసుల్లో సీజ్ చేసిన రూ.1,53,05,000 నగదుకు సంబంధించి మూడు కేసుల్లో రూ.1,37,26,000 నగదును ఆదాయ పన్నుశాఖకు రిఫర్ చేసినట్టు తెలిపారు. మిగిలిన 11 కేసులకు సంబంధించి రూ.15,79,000 నగదుకు సరైన ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పించి విడుదల చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కంటే అధిక నగదును సరైనా ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్నా, రవాణా చేస్తున్న సీజ్ చేస్తామని తెలిపారు. సీజ్ చేసిన నగదుకు సంబంధించి బాధితులు పూర్తి ఆధారాలను జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సమర్పిస్తే సీజ్ చేసిన నగదును విడుదల చేస్తారని కలెక్టర్ శరత్ పేర్కొన్నారు. నగదు తరలింపుపై సందేహాలు ఉంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ మోహన్‌రెడ్డిని 8978588552 ఫోన్ నెంబరుపై సంప్రదించవచ్చని కలెక్టర్ శరత్ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

KIDNEY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం. 47 సం||, అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. Ph: 9866007924, 9550336677, 040-27000580.
NT-320707

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.